క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఆదిమూలపు



సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, డాక్టర్ ఆదిమూలపు సురేష్ కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పీఏసీ సభ్యుల సమావేశానికి హాజరైన సురేష్ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలపై జగన్‌తో మాట్లాడారు.

స్వామిత్వ పథకంపై శిక్షణ

టంగుటూరు: స్వామిత్వ పథకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. టంగుటూరు, కొణిజేడు, అనంతవరం, ఆలకూరపాడు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు మాట్లాడుతూ అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి సర్వే చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు ఉన్న కుటుంబాలకు కచ్చితమైన భూ రికార్డులతో కూడిన రికార్డ్ ఆఫ్ రైట్స్ ఆస్తి హక్కు పత్రాలు అందజేస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ రామ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగు పెంచాలి

టంగుటూరు: రైతులు ఉద్యాన పంటలు పెంచితే రాయితీలు అందిస్తామని ఒంగోలు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఉపాధి హామీ కింద ఉద్యాన పంటలు సాగు గురించి మండల స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలైన పండ్ల తోటలు, కూరగాయలకు రాయితీలు అందిస్తామన్నారు. మండలంలో బోర్లు లేక నీటి సమస్య ఉన్నందున మూడేళ్లకు నీరు అందించి పెంచే తోటలు మామిడి, సపోట, డ్రాగన్ ఫ్రూట్ వంటివి ఫాం పాండ్ల ద్వారా నీటిని అందించవచ్చన్నారు. ఫారంపాండ్లకు ఒక్కో రైతుకు రూ.75 వేలు అందజేస్తామన్నారు. ఏపీఓ మాచర్ల, ఏఓ యుగంధరరెడ్డి, ఏఈఓ రామకృష్ణ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పీసీపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై మండల పరిధిలోని చింతగంపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనపై అవగాహన కల్పించి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వి. శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు యాజమాన్యం వరి, కంది, మొక్కజొన్న, సజ్జా, మిరప, పంటలు విత్తనాలు వేసే దగ్గర నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యవసాయాధికారి రంగకృష్ణ, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, ఉద్యానవనశాఖాధికారి కుసుమ, ఖాదర్‌బాష, అధికారులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు పూర్తిగా అరికట్టాలి

పామూరు: బాలికలపై లైంగిక వేధింపులు పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మండ్లా శైలజ అన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం బాలికలపై లైంగిక వేధింపుల నిరోధం, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల శరీర భాగాలను ఎవరైనా తాకినా, ఇతరుల ప్రవర్తన అసౌకర్యంగా ఉన్నా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. బాలికలు వారికి అపరిచిత వ్యక్తులు ఏవైనా తినుబండారాలు ఇచ్చినా తీసుకోవద్దన్నారు. అవసరమైతే 1098, 100, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.



పూర్తిగా ధ్వంసమైన రోడ్డు మార్జిన్



కొండపి-అనకర్లపూడి గ్రామాల మధ్య రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు



గురాయి కుంట వద్ద ఏర్పడిన గుంత

రోడ్డుపై గుంత.. ప్రయాణానికి చింత

- అధ్వానంగా రోడ్లు..ప్రయాణికుల అవస్థలు
- అడపాదడపా వర్షంతో మరింతగా దెబ్బతిన్న రోడ్లు
- గత సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు చేస్తానన్నా సీఎం చంద్రబాబు
- ఏడాది దాటినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కొండపి:

సంక్రాంతి నాటికి అద్దాల్లాంటి రోడ్లు దర్శనమిస్తాయని సీఎం చంద్రబాబు ఢాంబికాలు పలికారు. సంక్రాంతి వెళ్లిపోయి ఆరు నెలలు దాటినా కనీసం తట్ట మట్టి పోసే నాథుడే కరువయ్యారు. కూటమి ప్రభుత5పాడు, కొండపి నుంచి ఒంగోలు వయా కె.ఉప్పలపాడు, కొండపి నుంచి కందుకూరు మీదుగా వాహనదారులు ప్రయాణాలు చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

అడుగుకో గుంత..అడుగేసెదెట్లా..?

కొండపి నుంచి కందుకూరు వెళ్లే మార్గంలో నేతివారిపాలెం, కామేపల్లి గ్రామాల మధ్య దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై తారు లేచిపోయి కొంత మేర గుంతలు ఏర్పడ్డాయి. గురాయి కుంట వద్ద గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు పడిన సందర్భాలు కొకొల్లుగా ఉన్నాయి. కొండపి నుంచి అనకర్లపూడి నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. కొండపిలోని గ్రామ శివారు నుంచి అనకర్లపూడికి ప్రయాణించాలంటే దాదాపుగా 20 నిముషాలు ప్రయాణం పడుతుందంటే రోడ్డుపై గుంతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కొండపిలోని బీసీ హాస్టల్ నుంచి అనకర్లపూడి గ్రామ ప్రారంభం వరకు ఎక్కడ చూసినా భారీ గుంతలు ఏర్పడి వాహనదారుడు ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితులలో ఆ మార్గంలో ప్రయాణిస్తుంటే వాహనంతో పాటు వాహనదారుడు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పెట్లూరు చెరువు వద్ద రోడ్డు పై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షం నీరు

ఇదేవిధంగా అనకర్లపూడి, నెన్నూరుపాడు గ్రామాల మధ్య గుంతల ఏర్పడ్డాయి. మర్రిచెట్లపాలెం చీమకుర్తి నుంచి గ్రావెల్ టంగుటూరుకు తరలించడానికి కొండపి మీదుగా ప్రయాణిస్తే కిలోమీటర్లు, టోల్‌గేట్ భారం, ఆర్టీఓ అధికారుల భారం నుంచి తప్పించుకోవచ్చని ఎక్కువ సంఖ్యలో లారీలు ఇదే మార్గంలో ప్రయాణిస్తుండడంతో అధిక గుంతలు ఏర్పడుతున్నాయని వాహనదారులు పేర్కొన్నారు. కె.ఉప్పలపాడు నుంచి నిడమనూరు గ్రామాల మధ్య భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అమ్మో పొదిలి రోడ్డు..

వాహనదారులు పొదిలికి ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. మండలంలోని పెట్లూరు గ్రామం వద్ద ఎస్సీ కాలనీ నుంచి కోయవారిపాలెం వరకు రోడ్లు భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. పెట్లూరు ఎస్సీ కాలనీ నుంచి పెట్లూరు గ్రామం వరకు రోడ్డు మీద కారు పూర్తిగా లేచిపోయి వాహనాలు నడపాలంటే వాహనదారులు భయంతో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పెట్లూరు గ్రామం నుంచి కోయవారిపాలెం వరకు చెరువు కట్ట సమీపంలో రోడ్డు మధ్యలో భారీ గుంతులు ఏర్పడ్డాయి. అసలే చెరువుగడ్డ వద్ద మలుపులో ఉండడంతో ఆ భారీ గుంతల మధ్య ఆ మార్గంలో నూతనంగా వచ్చేవారు అనేకసార్లు ప్రమాదాలను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అడపాదడప వర్షాలు పడడంతో రోడ్డుపై గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నియోజకవర్గ కేంద్రమైన కొండపికి ఒంగోలు, టంగుటూరు, కందుకూరు పొదిలి, సంతనూతలపాడు నుంచి ప్రతి రోజు ద్విచక్ర వాహనాలతో పాటు లారీలు టిప్పర్లు, బస్సులు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఏడాదిగా మండలంలోని రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడి సైడు మార్జిన్లు అధ్వానంగా ఉన్నా అధికారులు ప్రజాప్రతినిధులు చూస్తూ ఈ రహదారిపై వెళుతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు.

వారానికి రెండుసార్లు అదే రోడ్డుపై..

మంత్రి స్వామి అందుబాటులో ఉన్న ప్రతిసారి కొండపికి వారానికి రెండుసార్లు అయినా వస్తూ ఉంటారు. నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన ప్రతిసారి ఆయ కార్యక్రమాలకు హాజరవుతూ ఇదే రహదారులలో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. కానీ ఏనాడు ఈ రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. ఇటీవల కురుస్తున్న ఆడపాదడపా వర్షాలకు రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా మంత్రి స్వామి అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పూర్తిగా ధ్వంసమైన మార్జిన్లు

రోడ్ల మార్జిన్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్డుకు సమాంతరంగా మార్జిన ఉండాల్సి ఉండగా రోడ్డు ఎత్తుకి మార్జిన్లు పూర్తిగా కిందకి వెళ్లడంతో ఎదురు వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల రోడ్డులో గుంతలో పడితే కొన్నిచోట్ల మార్జిన్ కు రోడ్డు చివరకు మధ్య గుంతలు ఏర్పడ్డాయి.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొండపి: కొండపి పంచాయతీకి ఆగస్టు 10న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి పంచాయతీకి బుధవారం నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. కొండపి పంచాయతీలో మొత్తం 14 వార్డులు ఉన్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సహకారంతో విజయవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ అంజలీదేవి, ఎంఈఓ-2 రామారావు, ఎంపీడీఓ లయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయింపు.

కొండపి సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గ్రామపంచాయతీని మొత్తం 14 వార్డులుగా విభజించామని ఆ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండపి గ్రామపంచాయతీలో కొండపి, కట్టావారిపాలెం, దాసిరెడ్డిపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలు ఉన్నాయి. వీటిలో 6,688 మందికి పైగా ఓటర్లు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ గఫార్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు.

➤ అదే విధంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిని కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మంగళవారం స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డిని చైర్మన్ గఫార్ ఘనంగా సన్మానించారు.

సాగుభూమి, నివేశన స్థలం ఇవ్వాలి

పామూరు: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం వ్యవసాయ భూమి, ఇంటిస్థలం ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సీనియర్ నాయకుడు జాలా అంజయ్య పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం 6వ మహాసభ స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం బి.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిచంచారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ పశ్చిమప్రాంత రైతులకు ప్రతి ఎకరానికి సాగుభూమి, రాయితీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి జాబ్‌కార్డులు ఇచ్చి పని కల్పించాలని, ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్తులను తక్కువ ధరకు విదేశీయులకు అమ్ముతున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్‌మీటర్లు పెడితే వెంటనే తొలగించాలని, వాటిని ప్రజలంతా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా జయరావు జెండాను ఎగురవేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానంద చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కె.మాల్యాద్రి, యాటా వీరనారాయణ, కాశీ శంకర్, ఖాదరున్నీసా, పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకుల జాలా అంజయ్య

పీఎంశ్రీ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన

సీఎస్‌పురం(పామూరు): పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రభుత్వం అత్యుత్తమ బోధనా సదుపాయాలు కల్పించిందని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం పీఎంశ్రీ ఉన్నతపాఠశాలలో మంగళవారం పాఠశాల ఐదేళ్ల వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నూతన విద్యావిధానం 2020లో భాగంగా పీఎంశ్రీ పాఠశాలలను ఐదేళ్లుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రతి పీఎంశ్రీ పాఠశాలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అమలుకోసం రూ.50 వేలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం రూ.25 వేల నిధులు విడుదల చేసిందన్నారు. పలు క్రీడాకార్యక్రమా లకోసం ఆటస్థలాల అభివృద్ధి, గ్రంథాలయాల ఏర్పాటు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు, సైన్సు ల్యాబొరెటరీలు, అదనపు గదుల నిర్మాణం చేస్తామన్నారు. విద్యార్థుల్లో సాంకేతికత అభివృద్ధి, వృత్తి శిక్షణ, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాల పెంపుదలకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్‌పీ సతీష్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.



పీయంశ్రీ పాఠశాల విద్యార్థులతో ఎంఈఓ కొండారెడ్డి

బాల్య వివాహాలు అరికట్టాలి



ర్యాలీ లో పాల్గొన్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐ సీహెచ్ హజరత్తయ్య అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ బాల కార్మికులను అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

- ముఖ్యమైన శాఖల అధికారులు గైర్హాజరు
- అరగంట లోపే సమావేశాన్ని ముగించిన అధికారులు

పీసీపల్లి: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. అయితే ఎంతో కీలకమైన ఈ సమావేశం మొక్కుబడిగా సాగింది. ముఖ్యమైన శాఖల అధికారులంతా గైర్హాజరు కావడంతో సమావేశం మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సమావేశానికి ఇరిగేషన్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఆర్ అండ్‌బీ, విద్యుత్, ఉపాధి హామీ, సోషల్ వెల్ఫేర్, ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ అత్యాల జపన్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంయుఆర్ శ్రీనివాసచారి, తిరుపలయ్య, జరీనా, సంజీవ్, ఉండాల మంజు భార్గవి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, చిలుకూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జపన్య

కూటమి ప్రభుత్వ వంచనను ఎండగడదాం



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా చెప్తున్న మాయమాటలను ప్రజలకు తెలియజేసేలా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, పార్టీ గ్రామ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పాకనాటి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరించి కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, బిల్లా కోటేశ్వరరావు, అరవ శ్రీనివాసులరెడ్డి, కుర్రి నరసింహారావు నాయుడు, అప్పాడి విజయకుమార్, ములుగు జాలిరెడ్డి, నాటారు వెంకట సుబ్బారెడ్డి, రేణుమాల వెంకట్రావు, సింగోతు సుబ్బారావు, కన్నా నాగార్జున, ఆరేటి నరసింహారావు, పురిణి దేవా, పురిణి శ్రీనివాసులరెడ్డి, షేక్ సుల్తాన్, కూనం నరేంద్రరెడ్డి, సుదర్శి వెంకట్రావు, యనమల మాధవి, చొప్పర వెంకన్న, సయ్యద్ ఆబిద్‌ఆలీ, పఠాన్ రియాజ్, షేక్ మహమ్మద్‌భాషా, షేక్ సలీం, గాదంశెట్టి గుప్తా, సోమిశెట్టి సురేష్, చుక్కాకిరణ్‌కుమార్, మిడసల అశోక్, గొల్లపోతు గోవర్ధన్, కోమిట్ల వెంకారెడ్డి, షేక్ అల్లాభక్షు, షేక్ కరీం, బుజ్జమ్మ, షేక్ నౌషాద్, ఏపూరి శ్రీనివాసులు, కేశవరపు కృష్ణారెడ్డి, శివారెడ్డి, కుర్రు ప్రసన్న, పాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మ దేవత కొలుపులు

మర్రిపూడి: మండలంలోని అయ్యపురాజుపాలెంలో నాగార్పమ్మ గ్రామదేవత కొలుపులను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న కొలుపులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను మేళతాళాలు, డప్పు, వాయిద్యాలతో గ్రామంలో ఘనంగా ఊరేగించి తిరిగి ఆలయంలో ఉంచారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మంత్రి స్వామి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, యర్రమోతు శ్రీనివాసులు, తుళ్లూరి నరసింహారావు, రేగులవీరనారా యణ, మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, సారెడ్డి యోగిరెడ్డి, సారెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు నీరు పోస్తున్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన యారాసి వెంకటరత్నం బస్టాండ్ సెంటర్‌లో దుకాణం వద్ద సరుకులు తీసుకొని వెళ్తాన్నాడు. ఈ తరుణంలో సీసీ రోడ్డుకు నీరు పోస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి వ్యక్తిని ఢీకొనడంతో వెంకటరత్నం కాలు విరిగింది. క్షతగాత్రుున్ని 108లో కనిగిరి వైద్యశాలకు తరలించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

హనుమంతునిపాడు: మండల పరిధిలోని పెద్దగొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఎస్సై ఎం మాధవరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో మంచి అలవాట్లు, క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎస్సై అంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దగొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో ఎస్సై

బావిలో పడి వ్యక్తి మృతి

కొండపి:

బావిలో పడే వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జాల్లపాలెం, కోయవారిపాలెం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్ కుమార్ వివరాల .. జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన మారం రెడ్డి రామకృష్ణారెడ్డి, సుజాతలకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు మనస్పర్థలు వలన రెండు సంవత్సరాల నుంచి విడివిడిగా ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం జాళ్లపాలెం నుంచి కోయవారిపాలెం వెళ్లే మార్గంలో కొల్లూరి ఆదెయ్యకు చెందిన బావిలో మారం రెడ్డి రామకష్ణారెడ్డి (40) బావిలో శవమై కనిపించాడు. బావిలోని శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. బావి బయట రామకృష్ణారెడ్డికి సంబంధించిన సెల్ ఫోన్, థమ్స్ అప్ బాటిల్, వాటర్ బాటిల్ చెప్పులు లభ్యమైనట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మారం రెడ్డి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

కనిగిరిరూరల్:

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి అన్నారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, అధ్యాపకులు హనోక్ కుమార్, నారాయణ, వెంకటయ్య, హరి నారాయణ, భాగ్యలక్ష్మీ, అంజని తదితరులు పాల్గొన్నారు.